## క్లుప్తంగా

### మాజీ మంత్రి ముద్రగడకు పరామర్శ



ముద్రగడను పరామర్శిస్తున్న చినిమిల్లి

భీమవరం అర్బన్: ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తన నివాసానికి వచ్చిన మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు ముద్రగడ పద్మనాభాన్ని శనివారం పార్టీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకట్రాయుడు పరామర్శించారు. కాకినాడ జిల్లాలోని కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కలిసి అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలన్నారు. చినిమిల్లి వెంట పార్టీ రాష్ట్ర యూత్ సెక్రటరీ మానుకొండ ప్రదీప్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు డీవీడీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

### పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ గీతా బాయి

పాలకోడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.గీతాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం అయిన మహిళను హాస్పటల్లో అందుతున్న సేవలు గురించి, సిబ్బంది ప్రవర్తన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరించి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు గులాబ్ రాజ్ కుమార్, స్వర్ణ నిరంజని, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

### వేంకటేశునికి ఊంజల్ సేవ

కాళ్ల: కాళ్ళ గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం పోలాంబ అమావాస్య పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, సహస్రదీపాలంకరణ సేవ, ఉంజల్ సేవ ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో అరుణ్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**చండీహోమం**

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా అర్చకులు, వేదపండితులు చండీహోమం నిర్వహించారు. 53 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. జిల్లా జడ్జి శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ శేషవస్త్రం ప్రసాదం అందజేశారు.

### డీఎస్సీలో సురేష్‌బాబుకు జిల్లా ర్యాంక్



సురేష్‌బాబును సత్కరిస్తున్న గోపీమూర్తి

భీమవరం: డీఎస్సీలో భీమవరానికి చెందిన కొండ్రు సురేష్‌బాబు జిల్లా స్థాయి పీఈటీలో ద్వితీయస్థానం సాధించారు. జోనల్ స్థాయి పీడీపోస్టులో 12వ స్థానం, ఎస్ఏలో 41వ స్థానం తో పాటు స్పోర్ట్స్ కోటా ద్వారా ఎస్జీటీగా కూడా ఎంపికై ఒకే నోటిఫికేషన్‌లో 4 పోస్టులు సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన్ని సత్కరించారు.

### పాలకోడేరులో సెకండ్ ర్యాంక్



నడిపల్లి వెంకటలక్ష్మి

పాలకోడేరు: మెగా డీఎస్సీలో పెన్నాడకు చెందిన నడిపల్లి వెంకటలక్ష్మి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో 85.89 శాతం మార్కులు సాధించి, రెండో ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి వెంకట త్రిమూర్తులు టైలరింగ్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా తనను ఉపాధ్యాయ వృత్తిలో చూడాలనేది ఆశయమని, ఆయన ప్రోత్సాహంతోనే ర్యాంక్ సాధించినట్లు చెప్పింది. వెంకటలక్ష్మికి పెన్నాడకు చెందిన తూర్పు కాపు విద్యా విజ్ఞాన సేవా సమితి నాయకులు అభినందనలు తెలిపారు.

### విశేషాలంకరణలో అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని శ్రీవిజయకనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారికి పోలాల అమావాస్య సందర్భంగా శనివారం జామకాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జామకాయలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల భవితకు భరోసా

- ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాల్లో శిక్షణ
- ప్రతి వారం ఫిజియోథెరపీ



కోరుకొల్లులో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పుతున్న దృశ్యం (ఫైల్)



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు (ఫైల్)

పాలకోడేరు: దివ్యాంగుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు బంగారు బాటలు వేస్తున్నాయి. అవయవ లోపం, బుద్ధిమాంద్యం వంటి మానసిక శారీరక వైకల్యం గల చిన్నారుల్లో మనోధైర్యం నింపి వారి పురోభివృద్ధికి భవిత కేంద్రాలు దోహద పడుతున్నాయి. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 వరకు సంరక్షించి ఉచిత విద్యను అందిస్తున్నారు. వారికి మధ్యాహ్న భోజన పథకంతోపాటు మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో ఉత్తేజ పరచి వారిని ప్రోత్సహిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు మండలంలోని కోరుకొల్లు గ్రామ స్కూల్, ఆకివీడు ఉండి, కాళ్ల మండలంలోని కోపల్లె పాఠశాలల ఆవరణలోని భవిత కేంద్రాలు ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రోత్సహించి వారిలో నూతన ఉత్సాహన్ని నింపుతున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతి బుధవారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన ఫిజియోథెరపీ గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో వారిలో శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలిక పాటి యోగాసనాలు ఎక్సర్‌సైజ్‌ల గురించి వివరిస్తున్నారు. వీటితో పాటు మంచానికి పరిమితమైన వారిని వారంలో రెండు రోజులు గృహ సందర్శన చేసి అవసరమైన ఫిజియోథెరపి సేవలను అందిస్తున్నారు.

**గత ప్రభుత్వ హయాంలో**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేయడంతో పాటు వినికిడి ఇతర అవయవ శరీర లోపాలు కలిగిన చిన్నారులను గుర్తించి సమగ్ర శిక్ష ద్వారా వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, హియరింగ్ మెషీన్లు వంటి వివిధ రకాల పరికరాలను అందజేసింది. కూటమి ప్రభుత్వం కూడా దివ్యాంగ చిన్నారులను గుర్తించి అవసరమయ్యే పరికరాలను అందజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### వీల్‌చైర్ పంపిణీ చేయాలి



మా బాబు అంగ వైకల్యంతో జన్మించాడు. వాడి పరిస్థితి చూసి చాలా ఆందోళనగా ఉండేది. భవిత కేంద్రంలో చేర్పించిన తరువాత నిత్యం ఫిజియోథెరపిస్ట్ సూచనల మేరకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. వాడిలో మార్పు వస్తుందని భావిస్తున్నాం. వీల్‌చైర్ అందజేస్తే బాగుంటుంది.

– ఆర్ రిత్విక్ తల్లిదండ్రులు, మొగల్లు

### గతం కంటే కాస్త మెరుగు



మా బాబు పుట్టుకతోనే బుద్ధి మాన్యంతో జన్మించాడు. ప్రతి పనికి ఎవరో ఒకరు తోడు ఉండాల్సి వస్తుంది. భవిత కేంద్రానికి తీసుకురావడంతో ఇక్కడ శిక్షణ ద్వారా కొన్ని విషయాలను మాకు చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు. వీల్ చైర్ తదితర పరికరాలు పనిచేస్తే ఇంకా మెరుగవుతుందని భావిస్తున్నాం

– డి బేబీ, కోరుకొల్లు

### తల్లిదండ్రులు శ్రద్ధచూపాలి



ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మానసిక ఉత్సాహం కలిగి పురోభివృద్ధి సాధించగలుగుతారు. వారికి అవసరమైన శారీరక శిక్షణను కూడా మా సూచనల మేరకు అందజేయాలి. ప్రతి శనివారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో వీల్‌చైర్ తదితర పరికరాలు కూడా పంపిణీ చేస్తాం.

– జానకి ఫణీంద్ర. ఐఈఆర్‌టీ టీచర్, భవిత కేంద్రం కోరుకొల్లు

### ఎంపీని కలిసిన రేషన్ డీలర్లు

భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఆయన పార్లమెంటరీ కమిటీ ఆహారం – ప్రజా పంపిణీ కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు శనివారం భీమవరంలోని ఆయన నివాస గృహంలో కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ కోశాధికారి మద్ది సుబ్బయ్య, దొంగ కృష్ణ, సాయి కృష్ణ, కుమార్‌రాజు, రవికుమార్, కేఎస్ .చక్రవర్తి, ఎం.శ్రీరాములు, రామాంజనేయ రాజు, ఆదినారాయణ, వైవీ కృష్ణ, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

ఆకివీడు: అంతర్జాతీయ స్థాయిలో మన అంతరిక్ష యానం అగ్రస్థానంలోకి దూసుకుపోతుందని భౌతిక, రసాయనిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పీ.పాల్ దివాకర్, డాక్టర్ కే.ఇమానియేల్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. అధ్యాపకులు మాట్లాడుతూ మన మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్ట దగ్గర నుంచి నేడు గగనయాన్ వరకూ ఎన్నో అద్భుతాలు సాధించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల వైపు విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం అతిథి అధ్యాపకుల్ని సత్కరించారు.

**వేంద్ర ఉన్నత పాఠశాలలో...**

పాలకోడేరు: వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన ఇస్రో చారిత్రక విజయాలు ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రధాన ఉపాధ్యాయులు జి శ్రీనివాస్ ప్రారంభించారు. హిందీ ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు ఈ ఫణి రాజేష్ మార్గ నిర్దేశంలో విద్యార్థులు చక్కని ఫొటో ప్రదర్శన నిర్వహించి ఇస్రో విజయాలపై వివరించారు. రాకెట్ నమూనాలను ప్రదర్శించారు.





ఆకివీడు: సైన్సు అధ్యాపకుల్ని సత్కరించిన వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం



పాలకోడేరు: జాతీయ అంతరిక్ష దినోత్సవంలో భాగంగా విద్యార్థుల ప్రదర్శన

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: నౌడూర్‌లోని కేఎస్ఎన్ఆర్ కాలేజ్ విద్యార్థులు జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ కేవీడి ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. కాకినాడలో జరిగిన జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లో బి నదియా, వి దేవి గోల్డ్ మెడల్ సాధించగా, ఎస్ భవ్య, ఎన్. అమృతలక్ష్మి, జి పూజిత, కే మోహన్ అంజలిశ్రీ, ఐ.పద్మావతి సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. బాలుర విభాగంలో కే గణేష్, ఏ.గిరినాగసాయి, బి సత్య ప్రకాష్ సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ చిరంజీవి, మాధవిలను ప్రిన్సిపాల్ బి శేషు అభినందించారు.

## కూటమి పాలనలో విద్యాబోధనకు సంకెళ్లు

టీచర్స్ ఎమ్మెల్సీ గోపీమూర్తి ఆవేదన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి విద్యా బోధనకు సంకెళ్లు వేస్తూ అస్తవ్యస్త విధానాలతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఎన్నికై న తరువాత ప్రప్రథమంగా స్థానిక పీఎల్ఎస్.జెడ్పీస్కూల్ ఉపాధ్యాయుల్ని ఆయన కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకే అధికంగా వినియోగిస్తోందని విమర్శించారు. యోగా, కిట్లు పంపిణీ, ఆన్‌లైన్ భారాలు పెరిగిపోయాయన్నారు. విద్యను అందించడంలో వెనకబడిపోతున్నామన్న భావనతో ఉపాధ్యాయులు తీవ్రంగా కృంగిపోతున్నారన్నారు. పరీక్షా విధానంలో అశాస్త్రీయమైన విధానాన్ని ప్రవేశపెట్టారని గోపీ మూర్తి దుయ్యబుట్టారు. విద్యార్థులు జవాబులు రాయడం, పరీక్షా పేపర్లు దిద్దేందుకు మరింత ఇబ్బందికరంగా ఏర్పడనుందన్నారు. అశాస్త్రయమైన పరీక్షావిధానంను తక్షణం రద్దుచేయాలన్నారు. ఉపాధ్యాయులు వన్‌సైడ్‌గా ఓట్లువేశారని చెప్పిన చంద్రబాబు ఏడాదిన్నర గడుస్తున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం నియామక పత్రాన్ని అందజేస్తున్న పార్థసారథి రెడ్డి

ఆకివీడు: ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలని, డీఏలు చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేటివ్ అధ్యక్షుడు మోరా పార్థసారథి రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఉర్దూ స్కూల్‌లో పీఆర్‌టీయూ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పరీక్షా విధానంను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం మండల కౌన్సిల్ నూతన కార్యవర్గం ఏర్పడింది. అధ్యక్షుడిగా ఎస్ఎస్‌వీ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్లా, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్. ఆశీర్వాదం, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ.సీతారాం, కార్యదర్శిగా ఎస్.నాగరాజు, మహిళా కార్యదర్శిగా పీఎం.సుజాత, ఎస్.శివకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ వ్యవహరించారు.

## 'అర్జున్ చక్రవర్తి' చిత్రబృందం సందడి



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో చిత్రబృందం

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ×అర్జున్ చక్రవర్తి₹ చిత్రబృందం సందడి చేసింది. చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నటీనటులు విజయరామరాజు, సిజరోజ్ శనివారం విద్యార్థులతో కలిసి సరదగా గడిపారు. అనంతరం చిత్రనిర్మాత గుబ్బల శ్రీను మాట్లాడుతూ సాధారణ యువకుడు దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడిగా ఎలా ఎదిగాడో అర్జున్ చక్రవర్తి చిత్రంలో చూపించినట్లు చెప్పారు. ఈ చిత్రానికి దర్శకుడిగా విక్రాంత రుద్ర, మ్యూజిక్ డైరెక్టర్‌గా విఘ్నేష్ భాస్కరన్ పనిచేయగా, దయానంద రెడ్డి, దుర్గేష్ నటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యావేత్త గుబ్బల తమ్మయ్య, వి చంద్రశేఖర్, కళాశాల డైరెక్టర్ ఎం .జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి

వీరవాసరం: రాయకుదురు సెక్టార్ నందు చింతలకోటి గరువు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీఈ దినోత్సవం నిర్వహించారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి, భీమవరం ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న విద్య అంశాలపై వివరించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తల్లులచే హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సరోజినీ, సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త జానకి, సహాయకురాలు పాల్గొన్నారు. బలుసు గొయ్యపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెరుకువాడ జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రాలో భాగంగా శనివారం చెరుకువాడ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా చెత్త తొలగింపు, దోమల నిర్మూలనకు డ్రెయిన్‌లో అయిల్ బాల్స్‌ను వేశారు. అనంతరం హైస్కూల్‌లో చేతుల పరిశ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం 6వ తరగతిలో విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీపీఓ ఎం.రామనాథరెడ్డి, డీఈఓ ఈ నారాయణ, సర్పంచ్ కొండవేటి సాంబశివ రావు, హెచ్ఎం అక్బర్ చక్రవర్తి, భీమవరం డీడీఓ వై దోసిరెడ్డి, ఎంపీడీవో ఎస్ శ్రీనివాస్, తహసీల్దార్ కే నాగార్జున, ఉండి డీటీ రాంప్రసాదరాజు, ఎంఈవో బీ జ్యోతి, బీ వినాయకుడు, డీఈ టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న మోషేనురాజు, అంజిబాబు

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలో శనివారం జైత్ర బిజ్ సొల్యూషన్స్, వెస్ట్ బెర్రీ స్కూల్, శ్రీభగవాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వినాయక చవితి పూజలో మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్‌వర్మ, శ్రీభగవాన్ ట్రేడర్స్ నడింపల్లి వెంకట రామరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, కోళ్ల నాగేశ్వరరావు, కలిదిండి బంగార్రాజు, శివరామరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీసీపీఎన్‌డీటీ చట్టం సలహా సంఘ సమావేశం

భీమవరం (ప్రకాశంచౌక్): పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో భాగంగా భీమవరం డివిజన్ పరిధి సలహా సంఘం సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ సీహెచ్.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగింది. పీసీపీఎన్‌డీటీ చట్ట పరిధిలో రిజిస్టర్ అయి పనిచేస్తున్న స్కానింగ్ సెంటర్లు పనితీరు, కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్లు నమోదు ప్రక్రియ, గతంలో రిజిస్టర్ అయిన రెండు స్కానింగ్ సెంటర్లలో చేసుకున్న మార్పులపై చర్చించారు. డివిజన్ పరిధిలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేయాలని కమిటీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు వైద్య నిపుణులు డా.కె.ప్రవీణ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.వెంకటేశ్వర్లు, సంజీవని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: పెదఅమీరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పెదఅమీరం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### సురవరం మృతి తీరని లోటు





సుధాకరరెడ్డికి నివాళి అర్పిస్తున్న నేతలు

భీమవరం: సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బడుగు, బలహీన వర్గాలకు తీరనిలోటని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు అన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ సురవరం మృతి పట్ల శనివారం పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 25న బహిరంగ వేలం

భీమవరం: స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో జప్తు చేసిన ద్విచక వాహనాలను ఈనెల 25వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎన్నార్ కళాశాల రోడ్డులోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఈ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగినవారు నేరుగా వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

### రజక సంఘం డిమాండ్

వీరవాసరం: రజకుల సమస్యలపై తక్షణం స్పందించాలని వీరవాసరం రజక సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. వీరవాసరం గ్రామంలో సుమారు 100 రజక కుటుంబాలు ఉన్నాయని, ఇప్పటివరకు అక్కడ రజకులకు చెరువు కేటాయించలేదని, 343 జీవో అనుసరించి రజకులకు ప్రత్యేక చెరువు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రజక సంఘం ప్రెసిడెంట్ పాలకోడేటి సత్యనారాయణ, పీఎల్‌డీ ప్రసాద్, అంజూరు, నాగరాజు, కేశవరపు, పెద్దిరాజు నాయకులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం తాడేరు గ్రామానికి చెందిన చుండూరు లీలా వెంకట శివరామ్ (19) ఈనెల 11న మోటారు సైకిల్‌పై వెళుతుండగా తాడేరురోడ్డులోని జడ్డూ బ్రహ్మాజీ వృద్ధాశ్రమం సమీపంలో కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివరామ్‌ను చికిత్స కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శివరామ్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాజీ చెప్పారు.

### హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఉండి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. శనివారం సాయంత్రం చెరుకువాడ శివారు ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ భారం కాదని, బాధ్యత అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేకపోవడం వలనే అనేకమంది మృత్యువాత పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దోమల వ్యాప్తిని అరికట్టాలి

భీమవరం: ఇంటి ఆవరణ, చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటి ప్రదేశాలు, తొట్టెలు, డ్రమ్ములలో దోమల గుడ్లు వాటి లార్వాలను తినే చిన్నవైన లార్వి ఓరస్ చేపలను పెంచడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని బలుసుమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఎ.లలిత కుమారి చెప్పారు. స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రా – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ×మాన్సూన్ హైజీన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి అరవిందస్వామి, బీఎంఎఫ్ నైటింగేల్, కె జాన్సీ, కాకుమాని శ్రీనివాసరావు, ఎల్ నర్సింహారావు, జి ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వానికి ప్రతీక రక్తదానం

భీమవరం: మానవత్వానికి ప్రతీక రక్తదానమని, ప్రతిఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చునని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా సుంకర పద్దయ్య వీధిలోని బ్రహ్మకుమారిస్ ఓం శాంతి యోగ భవనంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు.

**ప్రకటన**

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం శ్రీ మానుకొండ యాకోబు తండ్రి సత్యానందం మార్టుగేజ్ చేయుటకు అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించ బడవు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.1195/2021 భీమవరం మండలం, వేంపాడు గ్రామమునకు చెందిన ఆర్.యస్.నం. 291/3, 4 మరియు 291/5, 6 లలో 169.4 చ.గ. స్థలానికి హద్దులు: తూర్పు: [illegible] పడమర: ఉమ్మడి దారి ఉత్తరం: [illegible] దక్షిణం: [illegible] స్థలం

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490433732